

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

యాచారం, జూలై 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తక్కళ్లపల్లి గ్రామస్తులను కోరారు. గురువారం సాయంత్రం గ్రామంలో ఆయన పర్యటించారు. అపరిచిత వ్యక్తులు కాల్ చేసి బ్యాంక్ ఖాతా, ఆధార్ నంబర్లు, ఓటీపీ అడిగితే చెప్పొద్దన్నారు. మహిళలు ఒంటరిగా వెళ్లే సమయంలో విలువైన ఆభరణాలు ధరించరాదని కోరారు. యువత మద్యం, ధూమపానాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఏ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై ప్రియాంక, మాజీ సర్పంచ్ సంతోష, న్యాయవాది పగడాల శ్రీశైలం తదితరులున్నారు.



డీడీ మోహన్‌మురళిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ జీఎల్ఎన్ రెడ్డి

పాడి రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు చర్యలు

- విజయ పాల నాణ్యత, అమ్మకాలు పెంచాలి
- టీజీడీడీసీఎఫ్ డీడీ మోహన్‌మురళి

కడ్తాల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, విజయ పాల నాణ్యత తోపాటు అమ్మకాలను పెంచాలని జిల్లా పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌మురళి తెలిపారు. కడ్తాల్ పాల శీతలీకరణ కేంద్రం ఆవరణలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ లక్మారెడ్డితో కలిసి డీడీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాల బిల్లులు సకాలంలో అందించాలని, దాణా సక్రమంగా సరఫరా చేయాలని, పెంచిన దాణా రేటును తగ్గించాలని, టెండర్లు పూర్తిచేసిన దుకాణ సముదాయాన్ని ప్రారంభించాలని పాడిరైతులు, సేకరణ కేంద్రాల అధ్యక్షులు కోరారు. అనంతరం జరిగిన సదస్సులో డీడీ మాట్లాడుతూ నాణ్యమైన పాలను అందించి మద్దతు ధర పొందాలని కోరారు. బకాయి బిల్లులు త్వరలో ఇస్తామని, ఇకపై రెగ్యులర్‌గా చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్‌ని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి సత్కరించి స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ డీడీ సత్యనారాయణ యాదవ్, కడ్తాల్ పాలసేకరణ కేంద్రం మేనేజర్ ప్రాణేష్, షాద్‌నగర్ మేనేజర్ భారత లక్ష్మీ, పాలక సేకరణ కేంద్రాల అధ్యక్షులు చేగూరి వెంకటేశ్, రంగయ్య, నర్సింహారెడ్డి, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, నర్సింహ్మా, లక్ష్మయ్య, పాడి రైతులు, నాయకులు ఆనంద్, జోగు వీరయ్య, నర్సింహ్మా, గంప శ్రీనివాస్, రాములు, మహేశ్, జంగయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

శ్రావణం.. శుభప్రదం 6

- నేటి నుంచి వ్రతాలు ఆరంభం
- పూజలకు ఆలయాల ముస్తాబు
- మహిళలకు ప్రత్యేకం.. ఈ మాసం



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను వర్షం వదలడం లేదు. మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వాన కురుస్తుండటంతో జనాలు ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పంట పొలాలు నీట మునిగాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురువడంతో రోడ్లపై వరద నీరు చేరింది. వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పలుచోట్ల చెరువులు అలుగులు పారుతున్నాయి.

ఎడతెగని వాన

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు

- ఇళ్ల నుంచి బయటకురాని జనం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అలుగు పారుతున్న చెక్ డ్యాంలు
- నిండుకుండలా జంట జలాశయాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ, మూసీ
- బాచుపల్లిలో అత్యధికంగా 44.0 మి.మీ. వర్షపాతం



చౌదరిగూడలో కురుస్తున్న వర్షం



చౌదరిగూడ : తుమ్మలపల్లి శివారులో పత్తి పంటలో పారుతున్న వరద నీరు



చేవెళ్ల : బీజాపూర్ రహదారిపై ఇలా..

రంగారెడ్డి అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లాలో కురుస్తున్న వానకు జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్ సాగర్‌లోకి వరద నీరు చేరుతోంది. అంతర్గత రోడ్లు చిత్తడిగా మారాయి. మట్టిరోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. బీజాపూర్-చేవెళ్ల రహదారి వర్షానికి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఈసీ, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అలాగే కొందుర్గు మండలం పరిధిలోని పర్వతాపూర్, తంగెళ్లపల్లి, టేకులపల్లి, ఉత్తరాస్‌పల్లి, రేగడి చిల్కమర్రి, ముట్పూర్ గ్రామాల్లో పంట పొలాల్లో నీరు నిలిచి లోతట్టు ప్రాంతాలకు ప్రవహించింది. తుమ్మలపల్లి, లచ్చంపేట, చౌదరిగూడ, గుర్రంపల్లి, రావిరాల, పెద్ద ఎలికిచర్ల, చెగిరెడ్డి ఘనాపూర్ గ్రామాల్లో వాగులు ఉప్పొంగాయి. తుమ్మలపల్లి శివారులో వేసిన కల్వర్టు నాసిరకంగా చేపట్టడంతో కల్వర్టు చుట్టూ మట్టి కొట్టుకుపోవడంతో పక్కనే ఉన్న పంటలకు తీవ్రనష్టం ఏర్పడింది.

వికారాబాద్ జిల్లాలో...

వికారాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. జిల్లాలో 1,187 సాగు నీటి వనరులు ఉండగా, వాటిలో 23 చెరువులు అలుగు పారుతున్నాయి. 38 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీరు చేరుకుంది. 108 చెరువుల్లో 50 నుంచి 75 శాతం మేరకు నీరు రాగా, 268 చెరువుల్లో 25 నుంచి 50 శాతం వరకు నీరు వచ్చింది. 750 చెరువుల్లో 25 శాతం వరకు నీరు చేరింది. జిల్లాలో అల్లాపూర్ ప్రాజెక్టు మాత్రం అలుగెత్తి ప్రవహిస్తుండగా,

మిగతా 7వ పేజీలో...

జోరుగా వరి నాట్లు..

గత మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతులు కరిగేడు చేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు వేసిన వారు వరినారు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. మేడ్చల్ జిల్లా ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువు నీటి మట్టం పెరిగింది. యాచారం, ఎదులాబాద్‌లో మహిళలు ముసురు వర్షంలోనే వరినాట్లు వేశారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న వెంకటాపురం వాగు



కొందుర్గు మండల తంగేళ్లపల్లి-వెంకిర్యాల మధ్యలో పారుతున్న వాగు





చేవెళ్లలో కురుస్తున్న వర్షం

రైతు సమస్యలు పరిష్కరించాలి

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్



కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

రంగారెడ్డి అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో సునీల్‌కు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ నాయకులు లచ్చిరెడ్డి, బోసుపల్లి ప్రతాప్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి, మాధవ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, గోపాల్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీపతి యాదవ్, గెల్వాల్ ఉన్నారు.

డబ్ల్యూఆర్‌వోకు స్పాన్సర్‌గా జీఎంఆర్ ఏరోసిటీ



శంషాబాద్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ రోబో ఒలింపియాడ్(డబ్ల్యూఆర్‌వో) ఇండియా నేషనల్ ఛాంపియన్ షిప్- 2025కు జీఎంఆర్ ఏరోసిటీ ప్లాటినం స్పాన్సర్‌గా తీసుకున్నట్లు జీఎంఆర్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 5, 6వ తేదీల్లో ఏరీనాలో జరగనున్నట్లు చెప్పారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని యువతీయువకుల్లోని రోబోటిక్స్ నైపుణ్యాలను వెలికితీసేందుకు చక్కటి వేదిక కానుందన్నారు. ద ఫ్యూచర్ ఆఫ్ రోబోటిక్స్ అనే థీమ్స్‌తో ఈ కార్యక్రమం సాగనుంది. డబ్ల్యూఆర్‌వో ఇండియా-2025కు సీజన్‌కు ఇది ఫైనల్ ఈవెంట్, ఇందులో విజయం సాధించిన విజేతలు సింగపూర్‌లో జరగనున్న చాంపియన్‌షిప్‌లో దేశం తరఫున ప్రాతినిథ్యం వహిస్తారని పేర్కొన్నారు. జీఎంఆర్ ఏరోసిటీ యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో అమన్‌కపూర్ చెప్పారు.



గోశాల నిర్మాణానికి భూమిని చదును చేయిస్తున్న రెవెన్యూ అధికారులు

శరవేగంగా గోశాల నిర్మాణ పనులు

మొయినాబాద్ రూరల్, జూలై24(ఆంధ్యజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గోశాల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు స్థలాన్ని చదును చేయించారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఎన్కేపల్లి సర్వే నంబర్‌లోని 180లోని 99 ఎకరాలు 14 గుంటల స్థలంలో ప్రభుత్వం ఆధునిక గోశాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అదే ప్రభుత్వ స్థలంలో 40 ఏళ్ల నుంచి సాగులో ఉన్న రైతులు ఆందోళనకు దిగారు. భూములిచ్చేది లేదని నిరసనలు తెలిపారు. వారిని సముదాయించి 300 గజాల చొప్పున స్థలాలను అందించారు. దీంతో భారీ పోలీసుల బందోబస్తు మధ్య గురువారం గోశాల నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు సిబ్బందితో కలిసి కొనసాగించారు. రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తహసీల్దార్ గౌతమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఆర్‌ఐ రాజేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అయితే పోలీసులు సదరు స్థలంలోకి మీడియా వారిని కూడా అనుమతించలేదు.



మాట్లాడుతున్న రవీంద్రనాయక్

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్

రంగారెడ్డి అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్రనాయక్ గురువారం కొండాపూర్ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, మెదడువాపు, ఫైలేరియా, చికున్‌గున్యా, నీటి కలుషితం వల్ల డయేరియా, కలరా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, మాస్‌మీడియా అధికారి శ్రీనివాసులు, కొండాపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదు



కందుకూరులో బీజేపీ జెండాను ఎగురవేస్తున్న రాజ్‌భూపాల్‌గౌడ్

- స్వప్రయోజనాలు చూసుకున్న ఆ పార్టీల నేతలు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌గోపాల్‌గౌడ్

కందుకూరు/మహేశ్వరం, జులై24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదని, ఆ పార్టీ నేతల స్వప్రయోజనాల కోసమే పథకాలను అమలు చేశాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ఎన్నికల కన్వీనర్ ప్రబారి పాపారావు, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, నిమ్మ అంజిరెడ్డి, శ్రీరాములయాదవ్, తూళ్ల వీరేందర్‌గౌడ్, ఎల్మటి దేవేందర్‌గౌడ్, తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్, పల్లె కృష్ణగౌడ్, జిట్ట రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. గురువారం మహేశ్వరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా చేసుకోవడానికి మాత్రమే 42 శాతం రిజర్వేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. బీసీ రిజర్వేషన్ కోసం ఆర్డినెన్స్ తెచ్చిన కాంగ్రెస్.. రాష్ట్రం నుంచి అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు ఎందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికలు నిర్వహించలేని ప్రభుత్వం ప్రజల అవసరాలను ఎలా తీరుస్తుందన్నారు. కార్యక్రమంలో తెల్గమల్ల యాదీష్, కట్టా సుధాకర్‌రెడ్డి, అందెల శ్రీరాములుయాదవ్, పాపయ్యగౌడ్, అనంతయ్యగౌడ్, కె. జంగయ్యయాదవ్, మిద్దె సుదర్శన్ రెడ్డి, ఎ. యాదయ్యగౌడ్, కుండె వెంకటేష్, సుదర్శన్‌యాదవ్, మోహన్‌నాయక్, ముత్యం, సురేష్ పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు



యూరియా కోసం క్యూలో రైతులు

- పోలీసుల పహారాలో పంపిణీ

కేశంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో యూరియా కొనుగోలుకు రైతులు క్యూకట్టారు. మండల కేంద్రంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. కేశంపేట మండలంలో 35,000 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో దాదాపు 25,000ఎకరాలలో ప్రస్తుతం రైతులు పంటలు సాగుచేస్తున్నారు. అందులో 15,500 ఎకరాలలో మొక్కజొన్న, 7,500 ఎకరాలలో పత్తి, 1,500 ఎకరాలలో కంది, జొన్న పంటలు సాగు చేస్తున్నారు. అయితే మండలంలో దాదాపు 20 రోజులు వర్షాలు కురవలేదు. దీంతో రైతులు ఎరువులపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో

మిగతా 8వ పేజీలో...

తెగిన వాగు బ్రిడ్జికి మరమ్మతులు





బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

తాండూరు రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు తాండూరు మండలం బెల్కటూర్ గ్రామ శివారులో మంగళ వారం అర్ధరాత్రి వాగుపై బ్రిడ్జి తెగిపోయింది. దీంతో రాకపోకలకు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రవణ్‌కుమార్ సిబ్బందితో గురువారం ఉదయం నుంచే మరమ్మతు పనులుచేపట్టారు. జేసీబీ ద్వారా నాపరాతి ముక్కలు వేసి చదును చేంచారు. అనంతరం సిమెంటు పైపులు వేయించి పైన మట్టిపోయించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయి.

శ్రావణం.. శుభప్రదం

- నేటి నుంచి వ్రతాలు ఆరంభం
- పూజలకు ఆలయాల ముస్తాబు
- మహిళలకు ప్రత్యేకం.. ఈ మాసం



తాండూరు, జూలై24(ఆంధ్రజ్యోతి): సకల శుభాల శ్రావణ మాసం వచ్చేసింది. ఈ నెలలో ఇంటింటా శ్రావణ శోభ కనిపిస్తుంది. ఈ మాసం మహిళలకు ప్రత్యేకం. శుక్రవారం (25వ తేది) నుంచి శ్రావణ మాసం ఆరంభం కానుంది. ఈ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారానికి ఓ విశిష్టత ఉంది. ఈ మాసాన్ని 'నోముల మాసం'గా అభివర్ణిస్తారు. హిందూ క్యాలెండర్‌లో ఐదో నెలలో ఈ మాసం వస్తుందని, పవిత్రమైదని హిందువుల విశ్వాసం.ఈ మాసంలో శివుడు, పార్వతిదేవిని పూజించడంతో పాటు వరలక్ష్మీ మాతను మహిళలు ఆరాధిస్తారు. శ్రావణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకలు ప్రధానంగా నిర్వహిస్తారు. ఈ నెల 25న మొదటి శుక్రవారం కావడంతో తమ ఇళ్లల్లో, ఆలయాల్లో శ్రావణలక్ష్మి పూజలకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈ మాసంలో రుద్రాభిషేకాలు చేస్తారు.



నోములు

మహిళలు మంగళగౌరి, వరలక్ష్మీ వ్రతాలను ఆచరిస్తారు. మంగళగౌరి వ్రతాన్ని యువతులు పెళ్లైన ఏడాది తర్వాత మంగళవారం రోజున ఆచరిస్తుండగా పౌర్ణమికి ముందు వచ్చే(ఆగస్టు 8న) శుక్ర వారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచారిస్తారు.

పండుగలు..

ఈ మాసంలో పండుగల సందడి నెలకొంటుంది. ఆగస్టు 9న రాఖీ పండుగ, జంధ్యాల పౌర్ణమి, ఆగస్టు 15న నాలుగో శుక్రవారం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి, 27న వినాయక చవితి పండుగలు, అలాగే వరలక్ష్మీ వ్రతాలను చేసుకుంటారు.

సుముహూర్తాలు

ఈ నెల 28 నుంచి ఆగస్టు 22 వరకు శుభ కార్యాలకు ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణ వ్రతాల తో పాటు పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతర కార్యాలకు మంచి రోజులుగా భావిస్తారు. ఆషాఢం ముగియడంతో వివిధ శుభకార్యాలు చేపట్టేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. జూలై 26, 27, 30, 31, ఆగస్టు 1, 3, 4, 6, 7, 8, 9, 10, 11, 13, 14, 17, 18 తేదీల్లో పెళ్లి ముహూర్తాలున్నాయి. శ్రావణంలో ఉన్న 17 మంచి ముహూర్తాల్లో జిల్లాలో భారీగా పెళ్లిళ్లు జరగనున్నాయని పురోహితులు చెబుతున్నారు.

నేటి నుంచి కీసరగుట్టలో ప్రత్యేక పూజలు

కీసర: కీసరగుట్టలో శ్రావణ మాసం పూజలు నేటి నుంచి నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా వచ్చే నెల 23వ తేదీ వరకు రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల రోజుల పాటు జరిగే ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొన్ని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

రైలుకింద పడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



ఉప్పుల రాజేందర్ మృతదేహం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధి యంనంపేట్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా అడ్డగూడురు మండలం మానాయ్‌గూడానికి చెందిన ఉప్పుల రాజేందర్(21) పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ శ్రీనిధి ఇంజినీరింగు కళాశాలలో ఈసీఈ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం తెల్లవారుజామున రాజేందర్ యంనంపేట్ రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై శవమై కనిపించాడు. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వేపోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. రాజేందర్ అడ్రస్ ఆధారంగా అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఏఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు. రాజేందర్ ఆత్మహత్యపై అనుమానం ఉందని అతడి కుటుంబీకులన్నారు. ఫోన్‌డేటా డిలీట్ చేశారని, విచారణ చేయించాలని రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొండ వెంకటరంగారెడ్డి

సేవలు చిరస్మరణీయం



కొండ వెంకటరంగారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాష్ట్రాన్ని స్వతంత్ర భారత దేశంలో విలీనంచేయాలనే ఆలోచనను వ్యతిరేకించి రజాకార్లతో పోరాడిన మహనీయుడు కొండ వెంకటరంగారెడ్డి అని బీజేపీ చేవెళ్ల పట్టణాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం కొండ వెంకటరంగారెడ్డి వర్ధంతి సందర్భంగా చేవెళ్ల పట్టణంలో ఉన్న వెంకటరంగారెడ్డి విగ్రహానికి బీజేపీ నాయకులు పూలతో ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1959లో నీలం సంజీవ రెడ్డి ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రిగా, 1961లో దామోదరం సంజీవయ్య ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా కొండ వెంకటరంగారెడ్డి ప్రజలకు మెరుగైన సేవలందించారని గుర్తుచేశారు. ఆ రోజుల్లోనే కేవీ.రంగారెడ్డి, ఏవీ కళాశాల అనే విద్యాసంస్థను స్థాపించి మహిళలు, బాలికలను చదువులో ప్రోత్సహించారని నాయకులు గుర్తు చేశారు. భూ సంస్కరణల కోసం, నిరుపేదలకు భూమి పంచేందుకు పాటుపడ్డారని చెప్పారు. కొండ వెంకటరంగారెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు చిర స్మరణీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్గారి డాక్టర్ వైభవ్‌రెడ్డి, దేవుని శర్వలింగం, శంకర్‌గౌడ్, పీసరి శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, వెంకటేశ్, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, భార్గవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్, జయసింహరెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవవరణలపై సమావేశం

కొడంగల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. కొడంగల్ నియోజకవర్గంలో 1,200మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పట్ల రాజకీయ నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా రాజకీయ నాయకులు బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలంలోకి ఫ్యాక్టరీ రసాయన వ్యర్థాలు



మేడ్చల్ టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): తన పొలంలో వ్యర్థ రసాయనాలను వదలటంతో పంటకు నష్టం వాటిల్లిందటూ రైతు నవనీత ఆవేదన వ్యక్తం చేశారు. రాజబొల్లారం గ్రామానికి చెందిన నవనీత వ్యవసాయ పొలం పక్కనే ఉన్న ఐటీసీకి చెందిన పరిశ్రమ నుంచి రసాయన వ్యర్థాలు పొలంలోకి ప్రవేశించి పంట పూర్తిగా దెబ్బతిని పంట మొత్తం పనికి రాకుండా పోయిందని రైతు వాపోయారు. తన పంటకు, పొలానికి చేకూర్చిన నష్టంపై అధికారులు తగిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేకూర్చాలని మహిళా రైతు కోరారు.

ఆస్తి కోసమే తండ్రి హత్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

పెద్దేముల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కన్న తండ్రిని హత్య చేసిన కొడుకును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం తాండూరులోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు. పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామానికి చెందిన తలారి హన్మంతుకు ఐదుగురు కుమారులు. వారిలో నలుగురు కుమారులకు తలా ఒక ఎకరం పొలం రిజిస్ట్రేషన్ చేశాడు. రవికి మాత్రం ఆయన పేరున భూమి రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరించాడు. రవి తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడని, అతడి పేరున ఆస్తి రాసిస్తే దుర్వినియోగం చేస్తాడని భావించాడు. అందుకే రవి పేరిట కాకుండా అతడి కొడుకుపై భూమి పట్టా చేస్తానన్నాడు. దీనికి రవి అంగీకరించలేదు. తల్లితండ్రులతో ఈ విషయమై ఎప్పుడూ గొడవపడేవాడు. అంతే కాకుండా తన అన్నదమ్ములందరూ వేరు కాపురం పెట్టి వేరేచోట్ల ఉన్నారు. పక్షవాతం వచ్చిన తండ్రికి తాను మాత్రమే సేవచేయాల్సి వస్తోందంటూ నిత్యం కుటుంబ సభ్యులతో గొడవపడుతుండేవాడు. తల్లిని ర్సమ్మను కూడా కర్రతో కొట్టడంతో ఆమెకు గాయాలై ఆస్పత్రికి తరలించారు. ఇంటి వద్ద తండ్రి ఒక్కడే ఉండేవాడు. కాగా బుధవారం కూడా తండ్రితో ఆస్తి విషయమై రవి గొడవపడ్డాడు. ఇంట్లో ఉన్న సుత్తితో తలపై మూన్నాలుగు కొట్టడంతో తండ్రి హన్మంతు అక్కడికక్కడే మృతిచెందాడు. రవి అక్కడి నుంచి పారిపోయి తెలిసిన వారి ఫోన్ తీసుకొని 100కు డయల్ చేసి.. 'నేను నా తండ్రిని చంపాను.' అని చెప్పి పారిపోయాడు. సంఘటనా స్థలానికి తాండూరు రూరల్ సీఐ.నగేష్, ఎస్ఐ.వేణుకుమార్‌లు చేరుకుని దర్యాప్తు చేశారని, రవిని అరెస్టు చేశామని, రిమాండ్‌కు తరలిస్తున్నామని వివరించారు.

ఎంపీ కృషితో

250 టన్నుల యూరియా



వినతిపత్రమిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కృషితో షాద్‌నగర్ నియోజకవర్గానికి 250టన్నుల యూరియా రానుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. షాద్‌నగర్ ప్రాంతానికి 250టన్నుల యూరియాను విడుదల చేస్తామని చెప్పారన్నారు.

డబ్ల్యూఆర్వోకు స్పాన్సర్‌గా జీఎంఆర్ ఏరో సిటీ



ముస్తాబు కానునున్న జీఎంఆర్ ఎరీనా

శంషాబాద్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ రోబో ఒలింపియాడ్(డబ్ల్యూఆర్వో) ఇండియా నేషనల్ చాంపియన్ షిప్-2025కు జీఎంఆర్ ఏరో సిటీ ప్లాటినం స్పాన్సర్‌గా తీసుకున్నట్లు జీఎంఆర్ అధికారులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబరు 5, 6 తేదీల్లో ఎరీనాలో జరగనున్నట్లు చెప్పారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని యువతీయువకుల్లోని రోబోటిక్స్ నైపుణ్యాలను వెలికితీసెందుకు చక్కటి వేదిక కానుందన్నారు. ద ఫ్యూచర్ ఆఫ్ రోబోటిక్స్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమం సాగనుంది. డబ్ల్యూఆర్వో ఇండియా-2025కు సీజన్‌కు ఇది ఫైనల్ ఈవెంట్, ఇందులో విజయం సాధించిన విజేతలు సింగపూర్‌లో జరగనున్న చాంపియన్‌షిప్‌లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. జీఎంఆర్ ఏరోసిటీ యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జీఎంఆర్ ఎయిర్ పోర్టు ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో అమన్‌కపూర్ చెప్పారు. ఇందుకు జీఎంఆర్ ఎరీనాలో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎం హెచ్‌వో గీత

ఆమనగల్లు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎం హెచ్‌వో గీత అన్నారు. విధుల నిర్వహణలో అలసత్వానికి తావివ్వొద్దన్నారు. ఆమనగల్లు మండలంలో గురువారం ఆమె పర్యటించారు. ప్రభుత్వాసుపత్రిని సందర్శించి రికార్డులు, పరిసరాలు, మందుల నిల్వలు, వైద్య సేవలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని, మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రోగుల పట్ల మర్యాదగా మసలుకోవాలని సూచించారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్వో పద్మజ్యోతికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మంజులాదేవి, షైమూనా బేగం, ఎంపీహెచ్ ఈవో తిరుపతిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాబార్డు సేవలు ప్రశంసనీయం



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న చైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాచారం, జూలై24(ఆంధ్రజ్యోతి):గ్రామాల అభివృద్ధికి, రైతులకు పంట రుణాలివ్వడంలో నాబార్డు సేవలు ప్రశంసనీయమని యాచారం సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సహకారోత్సవం సందర్భంగా గురువారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాబార్డు అధికారులు జిల్లాకు కోట్లాది రుణాలందించి ఆదుకుంటుందన్నారు. మరిన్ని సేవలందించాలని కోరారు. నాబార్డు అధికారులు సహకార శాఖను బలోపేతం చేసేందుకు ముందుకురావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఎలాంటి ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా పంటలు సాగుచేయడంపై రైతులు దృష్టి సారించాలని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీకృష్ణ సూచించారు. చీడపీడల నివారణకు సేంద్రియ మందులే వాడాలన్నారు. ఇంట్లోనే రైతులు నాణ్యమైన విత్తనాలు తయారు చేసి తోటి రైతులకు విక్రయించి లాభాలు గడించాలని కోరారు. పాడిపరిశ్రమపై దృష్టి కేంద్రీకరించాలని ఆయన రైతులను కోరారు. పంటలపై చీడపీడల నివారణకు అధికంగా మందులు వాడి దిగుబడి తగ్గించుకుంటున్నారని చెప్పారు. నాబార్డు అధికారి అస్లాం. సీఈవో నాగరాజు, సిబ్బంది మహేష్, కె.గణేష్ తదితరులున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. గురువారం పరిగి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదిక తయారు చేయాలని సూచించారు. ఇబ్బందుల్లేని వాటిని మొదట పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో వాసు చంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి, డీటీ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య



ఎస్టీ హాస్టల్‌లో నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్, జూలై24(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు కల్పించి కార్పొరేట్ స్థాయి విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాన్నారు. మైసిగండి ఎస్టీ హాస్టల్‌లో గురువారం రూ. 6లక్షలతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని కసిరెడ్డి ప్రారంభించారు. రూ.2.6కోట్లతో నిర్మిస్తున్న అదనపు గదులు, డైనింగ్ హాల్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లేదని తెలిసి ఇంజినీరింగ్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులకు మంజూరైన ట్రంక్‌బాక్స్‌లు, డ్రెస్సులు, నోట్‌బుక్‌లు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. హెచ్‌డబ్ల్యూవో వి.బాలరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యకు చేసే ఖర్చును ప్రజల భవిష్యత్తు పెట్టుబడిగా భావించి ప్రభుత్వం విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఖానాపూర్‌లో 25ఎకరాల్లో రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఏకాగ్రత, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, హెచ్‌ఎం పాపయ్య, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, ప్యాక్స్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాసు శ్రీనివాస్‌రెడ్డి, జవర్‌లాల్, తులసీరామ్, రామకృష్ణ, షాబుద్దీన్, రాజేశ్, రాజేందర్ గౌడ్, మల్లేశ్, సుమన్, రవి తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం' అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

కడ్తాల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కడ్తాలలో గురువారం మండల కార్యకర్తల సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పార్టీ బలోపేతంపై చర్చించారు. ప్రధాని మోదీ పాలనాదక్షతతో దేశం అద్భుత విజయాలు సాధించిందన్నారు. కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అనేక పథకాలు అమలవుతున్నాయని ఆచారి తెలిపారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, మాజీ ఎంపీపీ వీరయ్య, ఎస్టీమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్, బీజేపీ నాయకులు మన్యానాయక్, భగీరథ, శ్రీశైలంగౌడ్, రవినాయక్, వెంకటేశ్, విక్రమ్‌చారి, బల్వంతరెడ్డి, కుమార్, సాయిప్రభు, కరుణాకర్, దశరథ్, కరుణాకర్‌రెడ్డి, రాజునాయక్, రవీందర్‌రెడ్డి, శ్రీను, రాందాస్, కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

కేశంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని సీఐ నరహరి తెలిపారు. మండలంలో ఏర్పాటు చేయడానికి తీసుకొచ్చిన సీసీ కెమెరాలను గురువారం పోలీస్‌స్టేషన్‌లో పరిశీలించారు. ఇప్పటికే లేమామిడి,తొమ్మిదిరేకుల, కాకునూర్, కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ చౌరస్తాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసు నిఘాతో సమానమన్నారు. ఎస్ఐ రాజ్‌కుమార్, పీసీ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, పాపిరెడ్డిగూడ జడ్పీహెచ్‌ఎస్‌లో మాజీ జెడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి సోలార్ సీసీ కెమెరా ఏర్పాటు చేయించారు. ఉపాధ్యాయులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి

శంకర్‌పల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శంకర్‌పల్లి మండల పరిషత్‌లో గురువారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని, దానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని వివరించారు. గ్రామ పంచాయతీ ఓటరు లిస్టుతో పాటు వార్డుల వారీగా లిస్టును పొందుపరచాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ సూచించారు.



వానలోనే విద్యార్థినులకు అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

వర్షంలోనే భోజనం వడ్డెన

మేడ్చల్ టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెడుతున్నా.. విద్యార్థులు భోజనం చేసేలా వసతుల కల్పించడంలో టీచర్లు, వంట సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవడం లేదు. మేడ్చల్‌లోని బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు వర్షంలో తడుస్తూనే లైన్‌కట్టి అన్నం కోసం నిల్చున్నారు. సిబ్బంది వంటపాత్రలను తరగతి గదుల వద్దకైనా తరలించ లేదు. వానలోనే అన్నం వడ్డించటంతో బాలికలు తడిసిపోయారు.

ఆర్టీసీని లాభాల బాటపట్టించిన ప్రభుత్వం



మహేశ్వరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మునిగిపోయే నావ అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినా అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్‌ను లాభాలబాట పట్టించిందని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడలో ఆయన మాట్లాడుతూ.. 2023 డిసెంబరు 9 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఇప్పటికే 200కోట్ల మహిళలు ఉచితంగా ప్రయాణించారని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి రూ.6,680కోట్లను చెల్లించిందన్నారు. అలాగే ప్రతీ పేదవాడికి ఆహార, ఆరోగ్య భద్రత కార్డులను అందజేస్తామన్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు ప్రభుత్వం రేషన్‌కార్డులు పంపిణీ చేపడుతుందన్నారు. కార్మిక, కర్షక, సాధారణ ప్రజలకు రూ.పది లక్షల వరకు వైద్య ఖర్చులు భరించేలా ఆరోగ్యశ్రీని అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేలా కాంగ్రెస్ నాయకులు పాటుపడాలన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు.

ఆస్పత్రిలో మందుల కొరత లేదు



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్

బొంరాస్‌పేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత లేదని జిల్లా డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రవీందర్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన ఆసుపత్రిని తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం తుంకిమెట్ల రైతు వేదికలో నిర్వహించిన టీబీ వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. మందులతో వ్యాధి నయమవుతుందని చెప్పారు. 15రోజుల కంటే ఎక్కువ కాలం ఛాతీలో నొప్పి, దగ్గు, ఉబ్బసం, అయాసం, తీవ్ర జ్వరం ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు హేమంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే 'మెడిసిటీ' లక్ష్యం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివరామకృష్ణ

మేడ్చల్ టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా మెడిసిటీ ఆస్పత్రి పనిచేస్తోందని ప్రొఫెసర్ శివరామకృష్ణ అన్నారు. గురువారం ఘన్‌పూర్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ సేవలపై కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలకు అందజేస్తున్న వైద్య సేవలపై చర్చించారు. శివరామకృష్ణ మాట్లాడుతూ.. మెడిసిటీ ఆస్పత్రిలో నిరుపేదలు వైద్యసేవలను సుభంగా పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందిస్తామని చెప్పారు. మేడ్చల్, శామీర్‌పేట మండలాల ప్రజలు వైద్యసేవలు సులభంగా పొందేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఖరీదైన అన్ని రకాల వైద్యసేవలూ ఇక్కడ పొందే వీలుందన్నారు. కార్యక్రమంలో మెడిసిటీ డైరెక్టర్ సి.గీత, మెడికల్ సైన్స్‌ప్రిన్సిపాల్ దేవందర్‌సింగ్ పాల్గొన్నారు.

భార్య కాపురానికి
రావడం లేదని ఆత్మహత్యాయత్నం

తాండూరు రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని భర్త బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. ఈ ఘటన జినుగుర్తిలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్ల రవి భార్య కొన్ని నెలల క్రితం కర్ణాటక రాష్ట్రం చందాపూర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఆమె తిరిగి రాలేదు. దీంతో రవి మద్యానికి బానిసయ్యాడు. తీవ్ర మనస్తాపంతో రవి మద్యం మత్తులో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. గొంతు తెగి రక్తస్రావమైంది. గమనించిన కుటుంబీకులు అతడిని తాండూరులోని ప్రభుత్వ జిల్లాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. రవి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అతడి సోదరుడు రాజు తెలిపాడు.

పని నుంచి బాలలకు విముక్తి

మేడ్చల్ టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న తొమ్మిది మంది బాలలను ఆపరేషన్ ముస్కాన్ అధికారులు గుర్తించి విముక్తి కల్పించారు. గురువారం మేడ్చల్ పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలతోపాటు పట్టణంలోని పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. బీజేఆర్ పరిశ్రమలో ముగ్గురు, సర్వోత్తం పరిశ్రమలో ఒకరు, ఎలిమెంట్ సెవన్ బారులో ముగ్గురు, హోటళ్లలో మరో ఇద్దరిని అధికారులు గుర్తించారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

తలకొండపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): అధైర్య పడవద్దు అండగా ఉంటామని మిషన్ భగీరథ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గట్టిప్పలపల్లికి చెందిన ఏదుల అశోక్ కుటుంబాన్ని గురువారం ఉప్పల వెంకటేశ్ పరామర్శించి సంతాపం తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, మాజీ జడ్పీటీసీ పద్మ నర్సింహ, నాయకులు జ్యోతయ్య, వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్ గౌడ్, కృష్ణ, రాజు, కానుగుల జంగయ్య, ఆంజనేయులు, శరత్‌చంద్ర, అనిల్, భాస్కర్, తదితరులు ఉన్నారు.

ఎడతెగని వాన

(ఐదో పేజీ తరువాయి)

మిగతా ప్రాజెక్టుల్లోకి ఇంకా ఆశించినంత నీరు చేరుకోలేదు. కోట్‌పల్లి ప్రాజెక్టులో నీటి నిలువ సామర్థ్యం 24 అడుగులు ఉండగా, 12 అడుగుల మేర నీరు చేరుకుంది. సర్పన్‌పల్లి ప్రాజెక్టు 18 అడుగుల సామర్థ్యం ఉండగా, ఇప్పటివరకు 14 అడుగుల నీరు చేరుకుంది. యాలాల్ మండలం జుంటుపల్లి శ్రీరాముల వారి ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 22 అడుగులు ఉండగా, ఇప్పటివరకు 14 అడుగుల మీర నీరు వచ్చింది. మోమిన్‌పేట మండల కేంద్రంలోని నందివాగు ప్రాజెక్టు 16 అడుగుల నీటి సామర్థ్యం ఉండగా, 8 అడుగుల వరకు నీరు చేరుకుంది. కక్రవేణి వాగు ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 14.7 అడుగులు ఉండగా, 6 అడుగుల మేర నీరు చేరింది. పరిగి మండలం, లక్నాపూర్ ప్రాజెక్టు సామర్థ్యం 18 అడుగులు ఉండగా, 5 అడుగుల మేర మాత్రమే నీరు ఉంది. మర్పల్లి మండలం, కొంశెట్‌పల్లివాగు ప్రాజెక్టు 8 అడుగులు ఉండగా, 3 అడుగులు, శివసాగర్ ప్రాజెక్టులో 9 అడుగులకు ఒక అడుగు మాత్రమే నీరు చేరుకుంది.

మేడ్చల్‌లో ఉధృతంగా మూసీ

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ సమీపంలోని మూసీనది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఉదయం నుంచి రాత్రి వరకు కురిసిన ముసురుతో జనాలు బేజారు పడ్డారు. బాచ్‌పల్లిలో అత్యధికంగా 44.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుత్బుల్లాపూర్‌లోని గాయత్రీనగర్‌లో 33.8 మిల్లీమీటర్లు, కుత్బుల్లాపూర్‌లో 38.3 మిల్లీమీటర్లు, బాలానగర్‌లో 33.0 మిల్లీమీటర్లు, మహాదేవ్‌పురంలో 37.5 మిల్లీమీటర్లు, కూకట్‌పల్లిలో 38.0 మిల్లీమీటర్లు, మల్కాగిజిరిలో 30.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌లో అత్యధికంగా 26.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పరిగి మండలం రాపోల్ గ్రామంలో 21.5 మిల్లీమీటర్లు, పెద్దేముల్‌లో 20.5 మిల్లీమీటర్లు, తాండూరులో 18.5 మిల్లీమీటర్లు, బషీరాబాద్‌లో 18.0 మిల్లీమీటర్లు, పూడూరులో 15.0 మిల్లీమీటర్లు, బొంరాస్‌పేటలో 14.8 మిల్లీమీటర్లు, కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌లో 14.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధిలోని పీజేఆర్ స్టేడియం సమీపంలో అత్యధికంగా 29.0 మిల్లీమీటర్లు అలాగే మాదాపూర్‌లో 26.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సరూర్‌నగర్ మండలం ట్రాన్స్‌పోర్టు బిల్డింగ్ సమీపంలో 21.8 మిల్లీమీటర్లు, గండిపేట మండలం మణికొండలో 24.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

పిడుగుల కాలం.. జర పైలం



పిడుగుపడి చనిపోయిన గొర్లు, మేకలు(ఫైల్)

అవగాహన లోపంతో పిడుగుపాటుకు గురవుతున్న ప్రజలు ● జాగ్రత్తలతో ప్రాణాలు కాపాడుకునే అవకాశం

దుద్యాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు అవగాహన లేక యేటా పిడుగు పాటుకుగురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మునుషులు, పశువులు, గొర్లుమేకలు తరచూ పిడుగుపాటుకు గురవుతూ ప్రాణాలు పోతున్నాయి. పిడుగుపాటు రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించడం లేదు. ఉరుములు, మెరుపుల సమయాల్లో ఎత్తైన ప్రదేశాల్లో ఉండే వృక్షాలపై పిడుగులు పడతాయి. వాటి కింద, లేదా సమీపంలో ఉంటే జీవులకు ప్రాణనష్టం సభవిస్తుంది. పొలం పనులు చేసే వారు, గొర్లుమేకలు, పశువుల కాపరులు వర్షం కురిసే సమయాల్లో తడవకుండా ఉండేందుకు చెట్లు, షెడ్ల కిందికి వెళ్తారు. ఇలాంటి సమయాల్లో పిడుగుపడి చనిపోతారు. ఈ కాలంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పిడుగుపాటు నుంచి రక్షించుకోవచ్చు.

వర్షం కురుస్తున్న సమయాల్లో ఇలా చేయొద్దు...

ఆకాశంలో నల్లని మబ్బులు, మెరుపులు, ఉరుములు రావడం, గాలులు వీయడం వంటివి ఉరుములకు సంకేతాలు. వర్షంపడే సమయంలో ఆరు బయట ఉండకూడదు. చెట్ల కిందికి పోవద్దు. సెల్‌ఫోన్లను స్విచాఫ్ చేసుకోవాలి. వ్యవసాయ పంపుసెట్లను, ఎలక్ట్రిక్ వస్తువులను ఉపయోగించకూడదు. స్తంభాలు, సెల్‌టవర్ల వద్ద నిల్చోవద్దు. ఇళ్లకు ఎర్తింగ్ తప్పక ఇప్పించుకోవాలి. ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు టీవీలు, ఇతర విద్యుత్ గృహోపకరణాలను ఆఫ్ చేసుకోవాలి. రైతులు పొలాల్లో ఉండకుండా వర్షంలోనైనా సరే ఇంటికి చేరుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో ఒకేచోట నిల్చోవద్దు. ఉరుములు, మెరుపులను చూడొద్దు. అలాచేస్తే కంటి చూపు దెబ్బతింటుంది. వర్షం కురిసే సమయాల్లో పొలాల్లో విద్యుత్ ప్రవహించే ఇనుప పనిముట్లు, ట్రాక్టర్లు, విద్యుత్ పరికరాలను వాడొద్దు. సెల్‌ఫోన్ మాట్లాడటం ప్రమాదకరం. దాన్ని స్విచాఫ్ చేయాలి. గొర్రెలు, మేకలు, పశువులను కొట్టాల్లోకి తరలించాలి. గోడలు, ఇనుప తలుపులు, కిటికీలకు దూరంగా ఉండాలి. ఒకవేళ పిడుగుపాటుకు గురైన వారికి ప్రథమ చికిత్స అందించి వెంటనే ఆస్పత్రులకు తరలించాలి. రెండు రోజుల క్రితం బొంరాస్‌పేట్ మండలం బుర్రితండా పరిధి మైసమ్మగడ్డ తండాలో మర్రిచెట్టుపై పిడుగుపడటంతో 13గొర్రెలు, 2 మేకలు మృతిచెందాయి. పిడుగుపాటు నుంచి రక్షించుకునేందుకు పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటించాలి.

వైన్స్‌లో చోరీ



వైన్స్ గోడకు చేసిన రంధ్రం

యాలాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): యాలాలలోని మన వైన్ షాపులో బుధవారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. దొంగలు షాప్ వెనుక భాగంలో గోడకు రంధ్రం చేసి చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా హార్డ్ డిస్క్‌ను ఎత్తుకపోయారు. ఘటన గురువారం ఉదయం వెలుగులోకొచ్చింది. వైన్‌షాపు సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వైన్‌షాపు వెనక గోడకు రంధ్రం చేయడం చూసి యజమానికి సమాచారం ఇచ్చాడు. యజమాని వచ్చి కౌంటర్‌లోని డబ్బును పరిశీలించారు. బుధవారం రాత్రి కౌంటర్‌లో ఉంచిన రూ.25వేలు, పర్మిట్ రూంకు సంబంధించిన రూ.18వేలు, మ్యాన్షన్ హౌస్ రెండు ఫుల్ బాటిళ్లు, బ్లెండర్స్‌ప్రైడ్ 3 ఫుల్ బాటిళ్లను ఎత్తుకపోయినట్లు తెలిపారు. తాము వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్‌గౌడ్ చెప్పాడు. ఎస్ఐ విఠల్ వైన్‌షాపును పరిశీలించారు.

పనులను పరిశీలించిన కమిషనర్



భూగర్భ డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఘట్‌కేసర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి దత్తాత్రేయనగర్‌లోని ఇటీవల నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను కమిషనర్ రాజేష్ గురువారం పరిశీలించారు. 'పనుల్లో నాణ్యతకు తిలోదకాలు-డ్రైనేజీ నిర్మాణంలో ఇష్టారాజ్యం' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారి స్పందించి పరిశీలించారు. దత్తాత్రేయనగర్ ప్రధాన రోడ్డు పక్కన రూ.10లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు, మ్యాన్‌హోళ్ల నిర్మాణాల్లో ఇసుకకు బదులు స్టోన్‌డస్ట్ వాడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. స్పందించిన కమిషనర్ మున్సిపల్ ఉద్యోగులను, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజిలెన్స్ విచారణ చేపట్టి పనుల్లో నాణ్యత నిర్ధారించే వరకు కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించొద్దని స్థానికులు కమిషనర్‌తో అన్నారు. అలాగే మ్యాన్‌హోళ్లకు లోపలి భాగంలో వాటర్ క్యూరింగ్ చేయడం లేదన్నారు. అదే సమయంలో కాంట్రాక్టర్ మ్యాన్‌హోళ్లను ఎక్స్‌కవేటర్‌తో పూడుస్తుండటంతో పనులపై విచారణ పూర్తయ్యే వరకు మట్టి పూడ్చొద్దని అధికారి ఆదేశించారు. కమిషనర్ వెంట స్థానికులు బొక్క ప్రభాకర్ రెడ్డి, లింగస్వామి, వెంకటేశ్, వెంకట్‌రావు ఉన్నారు.

ఆర్వోబీ కోసం రైల్వే మంత్రికి వినతి



కేంద్ర మంత్రి అశ్వనీవైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రాజేందర్

మేడ్చల్ టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అయోధ్య ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీని ఏర్పాటు చేయాలని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వనీవైష్ణవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఢిల్లీలో రైల్వే మంత్రిని ఎంపీ కలిసి లోక్‌సభ నియోజకవర్గంలోని పలు సమస్యలపై, ప్రజావసర పనులపై వినతిపత్రం ఇచ్చారు. ప్రధానంగా మేడ్చల్ చెక్‌పోస్ట్-గండిమైసమ్మ చౌరస్తా రోడ్డులో ఉన్న అయోధ్య ఎక్స్ రోడ్డు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రైళ్ల రాకపోకల సమయాల్లో కనీసం అర్ధగంటపాటు వాహనాలు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి రైల్వే గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఎంపీ ఈటలకు రైల్వే శాఖ మంత్రి హామీ ఇచ్చారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

కందుకూరు, జులై24(ఆంధ్రజ్యోతి):హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పేదలకు తెల్లరేషన్ కార్డులను పంపిణీకి రంగంసిద్ధమైందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు పదో తేదీ వరకు గ్రామాలు, మండల కేంద్రాల్లో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. దీంతో పేదలు ప్రభుత్వ పథకాలను నోచుకోక ఇబ్బందులు పడ్డారన్నారు. నేటి నుంచి రాష్ట్రంలో 7లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నేతలు, అధికారులు ఓ యజ్ఞంలా నిర్వహిస్తారని కప్పాటి అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే ఎల్పీజీ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని చెప్పారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షకు
పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పాలన అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. జూలై 27న ఆదివారం వికారాబాద్‌లోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ పాలన అధికారి(జీపీవో) పరీక్షకు 83మంది, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షకు 139 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. జీపీవో పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్ష తొలి విడత ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు, మలి విడత మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ నేమత్ అలీ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, దీపక్, మున్సిపల్ కమిషనర్ జకీర్ అహ్మద్, డీఎంహెచ్‌వో లలితాదేవి, ఇన్‌స్పెక్టర్ భీంకుమార్, ఈడీఎం హన్మంతు పాల్గొన్నారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి

» జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం



తాండూరులో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం

తాండూరు రూరల్/బషీరాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం ఫర్టిలైజర్ వ్యాపారులను ఆదేశించారు. గురువారం తాండూరు పట్టణ పరిధిలోని రవిరాజ్, గణేష్, కావేరీ, మహేశ్వరి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టాక్ బోర్డుతోపాటు బయట బ్యానర్‌పై సమగ్ర వివరాలను రాయాలని ఆదేశించారు. అనంతరం ఏవోలతో సమీక్ష నిర్వహించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తాండూరు మండల ఏవో కొమురయ్య తదితరులు ఉన్నారు. అలాగే బషీరాబాద్ మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. అక్కడున్న రైతులకు దొడ్డు యూరియా వాడకం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఆయనవెంట ఏవో అనిత, ఏఈవోలు ఉన్నారు.

ఇందిరమ్మ పాలనలోనే పేదలకు ఇళ్లు



ఇంటికి బేస్మెంట్ లెవెల్ బిల్లును అందజేస్తున్న రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి

తాండూరు రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లు కట్టిస్తోందని ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. గురువారం అంతారంలో బేస్మెంట్ లెవల్ వరకు నిర్మించుకున్న ఇళ్ల లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు వడ్డె శ్రీనివాస్‌తో కలిసి రూ.లక్ష చొప్పున బిల్లు చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల కరెంటు, రాజీవ్ యువ వికాస్ యోజన, రేషన్‌కార్డుల అందజేత వంటి సంక్షేమ కార్యక్రమాలను ఉధృతంగా చేపడుతోందని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పి.బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో పేదలకు 3,500ఇళ్లు మంజూరయ్యాయని, మరో విడత 3,500 ఇళ్లు వస్తాయని తెలిపారు. లబ్ధిదారులు ఎంత వేగంగా ఇంటి నిర్మాణాలు పూర్తిచేస్తే అంత త్వరగా బిల్లులొస్తాయని చెప్పారు. అంతారంలో కొత్తగా 75 రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెర్నె నాగప్ప, నాయకులు వడ్డె శ్రీనివాస్, ఉదయ భాస్కర్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పి.నర్సింహులు, రాములు, బి.అనంతయ్య, మొగులమ్మ గ్రామ మహిళలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతులు చేసే రక్తదానం ఆపదలో ఉన్నవారి ప్రాణాన్ని కాపాడుతుందని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ వసుధబక్షి అన్నారు. వెంకటాపూర్‌లోని యూనివర్సిటీలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రక్తదానంపై ప్రజలు అపోహలు వీడి రక్తదానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అప్పుడప్పుడు రక్తదానం చేస్తే మనం కూడా మరింత ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీన్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేశ్, శ్రీనివాస్, పురుషోత్తం, సౌరభ్ నవనీత, వలంటీర్లు పాల్గొన్నారు.

వేదాద్రిపై ఘనంగా లక్ష్మీసుదర్శన యాగం



యాగం నిర్వహిస్తున్న అర్చకులు

తలకొండపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): వెల్జాల శ్రీ వేదాద్రిగుట్టపై గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సుదర్శననారసింహస్వామి యాగాన్ని ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణానికి నిర్వహించిన యాగంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పూజలకు హాజరయ్యారు. అర్చకులు నర్సింహమూర్తి, శ్రీనివాసమూర్తి, పండితులు మురళీధర్‌శర్మల ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహించారు. సాయంత్రం వరకు యాగం, పూజలు కొనసాగాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్, ఏఎంసీ చైర్‌పర్సన్ వై.గీతనర్సింహ, పీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్‌శర్మ, వైద్యులు నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.నర్సింహ, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, డేవిడ్, రమేశ్ యాదవ్, బాల్‌రాజ్, వెంకట్‌రెడ్డి, అజీద్, అంబాజీ, అజీజ్, భూపతిరెడ్డి, విష్ణువర్ధన్, అశోక్‌బాబు, కృష్ణయ్యగౌడ్, నరేందర్‌గౌడ్, రేణురెడ్డి, యాదగిరి, నర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



కుట్టుశిక్షణా కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులు వచ్చి తాగు నీరు ఇవ్వండని ఫోన్‌నెంబర్ అడిగి మంగళసూత్రాలు అపహరించే ప్రమాదముంటుందని, అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు మహిళలకు సూచించారు. గురువారం మండలంలోని మేడిపల్లిలోని పలు బస్తీల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ నంబర్ అడిగితే చెప్పరాదన్నారు. మీకెలాంటి ఇబ్బందులున్నా డయల్ 100కు కాల్ చేసి సమాచారమందించాలని చెప్పారు. యువకులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలన్నారు. మహిళలు కుట్టుశిక్షణ నేర్చుకొని స్వయం ఉపాధి కల్పించుకునేందుకు కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం బ్యాంక్‌లో ఖాతాదారులను కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సైలు తేజంరెడ్డి, వంశీ ఉన్నారు.

పత్రీజీ ధ్యాన మార్గాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

- పిరమిడ్ ట్రస్టు చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి
- ఘనంగా పత్రీజీ స్మృతి స్మరణోత్సవాలు
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ధ్యానులు



ధ్యాన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పత్రీజీ సతీమణి స్వర్ణమాల పత్రీజీ

కడ్తాల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పత్రీజీ చూపిన ధ్యానమార్గాన్ని విశ్వవ్యాప్తం చేసి ఆరోగ్య సమాజ నిర్మాణానికి, శాంతి స్థాపనకు ధ్యాన మాస్టర్లు, పిరమిడ్ ట్రస్టు సభ్యులు కంకణబద్దులు కావాలని పిరమిడ్ ట్రస్టు చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ధ్యానం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించి ఆనందమయ జీవితాన్ని పొందవచ్చునని అన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో గురువారం ప్రపంచ ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ మూడవ స్మృతి స్మరణోత్సవాలు నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో పిరమిడ్ ఆవరణలో పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పిరమిడ్‌ను రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా పత్రీజీ శక్తిస్థల్‌ను సందర్శించి పత్రీజీకి నివాళులర్పించారు. అనంతరం పిరమిడ్ ఆవరణలో సామూహిక ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయుల ధ్యానమార్గం విశ్వశాంతికి దోహదపడుతుందన్నారు. ప్రపంచంలో అతి పెద్ద పిరమిడ్‌ను నిర్మించి కడ్తాల్ ప్రాంతానికి పత్రీజీ గుర్తింపు తెచ్చారన్నారు. పిరమిడ్ డైరెక్టర్లు హనుమంత రాజు, స్వర్ణమాల పత్రీజీ మాట్లాడుతూ మానవళి సన్మార్గ పురోగమనానికి ధ్యానం గొప్ప మార్గం అని అన్నారు. పత్రీజీ సంకల్ప విజయవంతానికి ప్రతీ పిరమిడ్ మాస్టర్ ఓ పత్రీజీ కావాలని కోరారు. ప్రముఖ కమెడియన్ పృథ్వీ, పిరమిడ్ ట్రస్టు సభ్యులు దామోదర్‌రెడ్డి, పరిమళ పత్రీజీ, పరిణతి పత్రీజీ, మాధవి, సాంబశివరావు, శివప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు.. అన్నదాతల ఆనందం



చేవెళ్ల : హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ఏర్పడిన గుంతలో నిలిచిన వర్షపు నీరు

ఇబ్రహీంపట్నం/చౌదరిగూడ/చేవెళ్ల/యాచారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఇబ్రహీంపట్నం పరిధిలో గురువారం పగలంతా జల్లులు కురిశాయి. రహదారులు చిత్తడిగా మారాయి. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట చేలల్లో కలుపు పెరిగింది. వాన తెరిపిస్తే కలుపు తీయడానికి వీలవుతుంది. మెట్టలో రైతులు అక్కడక్కడ టమాట, మిరప నార్లు వేస్తున్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పలు గ్రామాల్లో వాగులు పొంగి పొర్లుతున్నాయి. వరి నాట్ల కోసం రైతులు కరిగేట్లు జోరుగా చేస్తున్నారు. మరో వారం రోజుల్లో వరి నాట్లు వేసేందుకు రైతు సమాయత్తం అవుతున్నారు. చేవెళ్లలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో చెరువులు, కుంటలకు నీరు రాలేదు. అయితే, పలు గ్రామాల్లో వెళ్లే రోడ్లన్నీ గుంతలతో ఉండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఏర్పడిన పెద్ద గుంత కారణంగా వర్షం కురువడంతో రోడ్డుపై చెరువును తలపిస్తోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు దుకాణాలకు వెళ్లి ఎరువులు తెచ్చుకుంటున్నారు. యాచారం మండలంలోని గ్రామాలలో నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా జల్లులు పడుతున్నాయి. వర్షాన్ని లెక్కచేయకుండా రైతులు, కూలీలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. మేడిపల్లి, కుర్మిద్ద, చౌదర్‌పల్లి, యాచారం తదితర గ్రామాల్లో వరి నాట్లు వేయడంలో రైతులు నిమగ్నమయ్యారు.



చౌదరిగూడ : కొందుర్గు మండలం ఉత్తరాశిపల్లి వద్ద వాగు ఉధృతిని పరిశీలిస్తున్న షాద్‌నగర్ రూరల్ సీఐ నరసయ్య

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



న్యాయవాదులతో రఘునాథ్

చేవెళ్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): యువ న్యాయవాదులు ప్రతిక్షణం కొత్త చట్టాలు, వాటిపై పనిచేసే వ్యవస్థలపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.రఘునాథ్ తెలిపారు. గురువారం చేవెళ్ల కోర్టును ఆయన సందర్శించి న్యాయ వాదుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టం సాధించి పెట్టడంలో, కంప్యూటర్ సదుపాయాలు, లైబ్రరీలు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితిలో బార్ కౌన్సిల్ కొనసాగుతోందని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు న్యాయవాద వృత్తిలో రాణిస్తున్నారని చెప్పారు. న్యాయవాదుల వెల్ఫేర్ గురించి సహజ సిద్ధమైన రీతిలో చట్టపరంగా నిర్ణయం తీసుకోగలిగి, న్యాయవాదులకు తోడ్పాటు చేకూర్చగల శక్తి బార్ కౌన్సిల్‌కు ఉందన్నారు. రాష్ట్రంలో 50వేల మంది వరకు న్యాయవాదులుగా ప్రాక్టీసు చేస్తున్నారని, రాష్ట్రంలో ఏడాదికి పదివేల మంది న్యాయవాదులను తయారు చేస్తున్న విద్యాసంస్థల తీరును ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. భవిష్యత్‌లో యువ న్యాయవాదులకు శిక్షణా తరగతులు ఏర్పాటుచేసి ప్రతిభను వెలికి తీస్తామన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల న్యాయవాదులు, తదితరులున్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్సై శరత్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలకు చెందిన గణేష్(25) హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తుంటాడు. గురువారం ఉదయం బైక్‌పై స్వగ్రామానికి బయలు దేరాడు. ఈక్రమంలో రాయికల్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత పెట్రోల్ పంప్ వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీకొంది. దాంతో బైక్ లారీ ముందు భాగంలోకి చొచ్చుకుపోయింది. గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శరత్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

కొత్తూర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పారిశ్రామికవాడ శివారులో తీగాపూర్ రోడ్డులో విద్యుత్ స్తంభం ఎత్తే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మహేందర్(20) అనే కూలీ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి తీగాపూర్ శివారులో గల ఓ పరిశ్రమకు నూతన విద్యుత్ లైన్‌ను వేసేందుకు కాంట్రాక్టర్ కూలీలతో పనులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం పనులు చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మహేందర్‌కు తీవ్రగాయాలవ్వడంతో తోటి కూలీలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. కాగా, ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ

కేశంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని ఎక్వాయిపల్లికి చెందిన శివ అనే వ్యక్తి మూడు నెలల క్రితం కేశంపేట మండల కేంద్రంలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్‌చేసిన పోలీసులు సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. ఈమేరకు గురువారం బాధితుడిని కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, సీఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్‌లు ఫోన్ అందజేశారు. ఫోన్ విలువ రూ. 20వేలు ఉంటుందని సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం



రుబీనా కుమారి

శంషాబాద్ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన సంఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్‌లోని కైరబడి గ్రామానికి చెందిన రుబీనా కుమారి జీవనోపాధి కోసం గత 3 సంవత్సరాల క్రితం శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి పాత తండాకు కుటుంబ సభ్యులతో వచ్చింది. గ్రామ శివారులోని పాత్లవత్ వెంకటేశ్‌కు చెందిన మామిడి తోటలో పనికి కుదిరి అందులోనే నివాసముంటున్నారు. ఈనెల 24న రాత్రి రుబీనా వాష్‌రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



షాద్‌నగర్ అర్బన్ : ఫరూఖ్‌నగర్ ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న టీచర్లు

షాద్‌నగర్ అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఫరూఖ్‌నగర్ ఆర్ఐ రోజాకు వినతిపత్రం ఇచ్చారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, 40 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో సబ్జెక్ట్‌కు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె. వెంకటయ్య, ఎన్.నర్సింహులుగౌడ్, శంకర్, బి. కృష్ణయ్య, రవీంద్రనాథ్, సత్యం, చంద్రశేఖర్, శివరాములు, తిరుమలయ్య తదితరులున్నారు.

చేవెళ్ల : రాష్ట్రంలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్ అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని, వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. హరికృష్ణ, అనిల్, ప్రణవ్, సందీప్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

చౌదరిగూడ : ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కొందుర్గుకు చెందిన యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లేడ్ చౌదరిగూడ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ అన్నారు. కొందుర్గు జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్‌లకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. యూటీఎఫ్ నాయకులు ప్రేమ్‌సాగర్, వీరేషం, సుధాకర్, రాజయ్య, సంజు, స్వర్ణలత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు ఒకటిన అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ తెలిపింది. ఈ మేరకు ఇబ్రహీంపట్నం తహసీల్దారు కార్యాలయంలో డీటీ శ్రీనివాస్‌కు వినతిపత్రమందజేశారు. అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సపావట్ రవీందర్ నాయక్ అన్నారు. జీహెచ్ఎం, ఎస్ఏ, పీఎస్‌హెచ్ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, జూనియర్ లెక్చరర్ పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్లకు 40 శాతం వాటాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీఎడ్, డీఎడ్ అర్హతలున్న ఎస్టీలకు సీ నియార్టీ ప్రకారం పీఎస్‌హెచ్ఎం ప్రమోషన్లు కల్పించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఇబ్రహీంపట్నం మండలాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కొ రివి రవి, ఘాస్సీరాంనాయక్ తదితరులున్నారు.

షాబాద్ : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని బీజేవైఎం మండలాధ్యక్షుడు దాదె మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

తలకొండపల్లి : విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి రామయ్య, మండలాధ్యక్షుడు విష్ణుమూర్తిలు ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులతో కలిసి డీటీకి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు పాండు నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

(ఐదో పేజీ తరువాయి)

పంటల ఎదుగుదలకు యూరియా వేయాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో గురువారం కేశంపేట మండల కేంద్రంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూరియా కొనుగోలు కేంద్రానికి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. దీంతో యూరియా అమ్మకానికి ఆటంకం ఏర్పడింది. కొనుగోలు కేంద్రం వద్ద భారీగా గుమికూడడంతో పోలీసులు చేరుకొని యూరియా పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. ఒకే రోజు 550 బస్తాల యూరియాను పంపిణీ చేశారు.

ప్యాక్స్ ద్వారా మాత్రమే అమ్మకం

మండలంలో కొత్తపేట ప్యాక్స్ ద్వారా మాత్రమే యూరియా అమ్ముతుండడంతో రైతులకు యూరియా సమస్య ఎదురవుతోంది. ఒక సెంటర్ ద్వారా మాత్రమే యూరియా అమ్ముతుండడంతో రైతులు యూరియా కొనుగోలు కోసం ఎగబడుతున్నారు. ప్యాక్స్ చైర్మన్ గంధ్ర జగదీశ్వర్‌గౌడ్ రెండు రోజులకు ఒకసారి 1600 బస్తాల యూరియాను తెప్పించి రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఈ సీజన్‌లో 1500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండడంతో ఇప్పటికే 900 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు విక్రయించినట్లు మండల వ్యవసాయాధికారి శిరీష తెలిపారు. రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. కేశంపేట మండలానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే కృషితో గురువారం 60 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, దానికి పూర్తి స్థాయిలో రైతులకు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యెన్నం శ్రీధర్ రెడ్డి తెలిపారు.

అందరికీ ఆరోగ్యం.. అదే ప్రభుత్వ లక్ష్యం



ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కులం, మతం, రాజకీయాలకతీతంగా అందరి ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్న తపనతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, అదే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఆకుల నిర్మలమ్మ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్య పరిరక్షణ కోసం గురువారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నిర్మలమ్మ కుమారుడు ఆకుల శ్రీనివాస్‌కు రూ.4.40 లక్షల ఎల్వోసీని ఎమ్మెల్యే అందజేశారు. ఒకవైపు ప్రభుత్వ ఆసుపత్రులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూనే, మరోవైపు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థికసాయం చేస్తున్నామని వీర్లపల్లి శంకర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం



అశోక్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వెంకటేశ్

తలకొండపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): అధైర్య పడవద్దు అండగా ఉంటామని మిషన్ భగీరథ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గట్టిప్పలపల్లికి చెందిన ఏదుల అశోక్ కుటుంబాన్ని గురువారం ఉప్పల వెంకటేశ్ పరామర్శించి సంతాపం తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, మాజీ జడ్పీటీసీ పద్మ నర్సింహ, నాయకులు జ్యోతయ్య, వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, కృష్ణ, రాజు, కానుగుల జంగయ్య, అంజనేయులు, శరత్‌చంద్ర, అనిల్, భాస్కర్, తదితరులు ఉన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



షాద్‌నగర్ అర్బన్ : మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ/ చేవెళ్ల/షాబాద్/మొయినాబాద్ రూరల్/కేశంపేట/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మాడ్గుల/శంకర్‌పల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం షాద్‌నగర్‌లో ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జానంపేట భవాని మాత ఆలయంలో కేటీఆర్ పేరున పూజలు చేయించారు. కొందూటి నరేందర్, ఈటే గణేష్, ఎంఎస్ నటరాజ్, కడెంపల్లి శ్రీనివాస్, పి.లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులున్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, చంద్రయ్య, భరత్‌రెడ్డి తదితరులున్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో మండలాధ్యక్షులు హఫీజ్, శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జిల్లేడ్‌లో విద్యార్థులకు బ్యాగులు, చింతకుంట తండాలో మాజీ సర్పంచ్ హరినాయక్ నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ తదితరులున్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, చేవెళ్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, మాజీ చేవెళ్ల వైస్ ఎంపీపీ శివప్రసాద్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ నర్సింలు, నారాయణ, కృష్ణ, వెంకటేశ్, చందు, మాధవరెడ్డి, మాణిక్యరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు. మహాలక్ష్మి పథకం పేరుతో ప్రభుత్వం మహిళలతో ఆటలాడుకుంటోందని షాబాద్ మాజీ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా షాబాద్‌లో స్టార్ గార్డెన్‌లో 150 మంది మహిళలకు కుట్టుమెషీన్లు, ముగ్గురికి స్కూటీలు పంపిణీ చేశారు. లింగారెడ్డిగూడకు చెందిన కాంగ్రెస్ నాయకులు అవినాష్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు చాంద్‌పాష, ఏఎంసీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు జడల రాజేందర్‌గౌడ్, రాందేవ్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సత్యం, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులున్నారు. కేటీఆర్ ఐటీ రంగంలో తెలంగాణతో పాటు నగర శివారు ప్రాంతం రంగారెడ్డిని ఎంతో బలోపేతం చేశారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అనంతరెడ్డి, మొయినాబాద్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కేక్ కట్‌చేశారు. ముదిగొండ శ్రీహరి యాదవ్, ముదిగొండ రవి యాదవ్, శ్రీనివాస్, తదితరులున్నారు. కేశంపేట మండల కేంద్రంలో నాయకులు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల వైస్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్‌గౌడ్, ప్యాక్స్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, గోపాల్, తదితరులున్నారు. ఆమనగల్లు పట్టణంలోని బస్టాండ్ ఎదుట బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌లు హాజరై కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. నిరంజన్‌గౌడ్, సయ్యద్ ఖలీల్, బాలస్వామి, కమటం వెంకటయ్య, తదితరులున్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో గ్రామాధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకటేశ్, జోగు వీరయ్య, లచ్చిరామ్ నాయక్, తదితరులున్నారు. తలకొండపల్లి మండలం కేంద్రంలో మాజీ జడ్పీటీసీ వెంకటేశ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, నిర్మలశ్రీశైలం గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి లు కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ముజుబుర్ రహెమాన్, నర్సింహ, గోపాల్ నాయక్, తదితరులున్నారు. మాడ్గుల మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు మండలాధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ పట్టాభి తిరుమల్‌రెడ్డి, డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రవి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, నాయకులున్నారు. కేటీఆర్ జన్మదిన వేడుకలు శంకర్‌పల్లి చౌరస్తా, సిటిజెన్ ప్యాలెస్‌లో శంకర్‌పల్లి మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాణిక్‌రెడ్డి, పాపారావు, మాజీ సర్పంచులు శ్రీధర్, నర్సింహారెడ్డి. మాజీ ఎంపీటీసీ యాదగిరి, తదితరులున్నారు.

రాజు కుటుంబానికి ఎంపీడీవో పరామర్శ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్‌గల్‌లో కాళ్లూ చేతులు చచ్చుబడి విగత జీవిగా కాలం వెళ్లదీస్తున్న రాజు ఇటీవల ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలవడానికి తన కుటుంబీకులతో యత్నించడంతో అతడిని కలవకుండానే ఎమ్మెల్యే వెళ్లిపోయారు. ఈ విషయమై ఈనెల 23న 'ఆంధ్రజ్యోతి'లో 'ఎమ్మెల్యే సార్.. ఆదుకోండి' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో రాధారాణి స్పందించారు. గురువారం రాజు ఇంటికి వెళ్లి కుటుంబ విషయాలపై ఆరా తీశారు. అతనికి పింఛన్ మంజూరు చేయాలంటే సదరన్ సర్టిఫికెట్ కావాలని ఎంపీడీవో చెప్పారు. ఆ సర్టిఫికెట్ తీసుకునే విధానంపై కుటుంబికులకు వివరించామన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

మంచాల, జూలై 24(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ పసుల వెంకటేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లున్నారు. భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలోనే గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం నిర్వహించిన పసుల వెంకటేష్ దశదిన కర్మలో 2007 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ మిత్రులు పాల్గొన్నారు. స్నేహితులంతా కలిసి పోగుచేసిన రూ.2,13,500 చెక్కురూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

నందివనపర్తిలో ఆయుర్వేద వైద్యశిబిరం

యాచారం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివనపర్తిలో గురువారం ఆయుర్వేద వైద్యురాలు ఇందిర ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. వంద మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి

యాచారం, జూలై 24(ఆంధ్రజ్యోతి): వైద్యులు తరచూ మారుమూల గ్రామాలకు తరలి పేదలకు ఉచితంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేసి ఆదుకునేందుకు చొరవ తీసుకోవాలని ఎస్సై సత్యనారాయణ కోరారు. గురువారం పీపుల్స్ ఆసుపత్రి వైద్యులు మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 250 మంది రోగులను పరీక్షించి మందులు అందించారు.

పాషాకు పరామర్శ



పాషాను పరామర్శిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 24(ఆంధ్ర జ్యోతి): ఆమనగల్లు లయన్స్ క్లబ్ పీఆర్వో, విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ పాషాను లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్, జిల్లా పశుపోషకుల సంఘం అధ్యక్షుడు జి.చెన్నకిషన్‌రెడ్డి పరామర్శించారు. పాషా సతీమణి షాహిన్ ఇటీవల మృతిచెందింది. ఆమనగల్లు పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం పాషాతో పాటు ఆయన కూతుర్లు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. షాహిన్ మృతి పట్ల సంతాపం తెలిపారు. మనోధైర్యంతో ఉండాలని సూచించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి గంప శ్రీను, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

ఆమనగల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ, మండల బీజేపీ కార్యకర్తల సమావేశం నేడు(శుక్రవారం) స్థానిక భవాని గార్డెన్‌లో ఏర్పాటుచేసినట్లు పార్టీ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీను లు తెలిపారు. సమావేశానికి ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు హరిప్రసాద్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

పొర్లగడ్డ తండా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

మంచాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): పొర్లగడ్డతండా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని బండలేమూర్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. బండలేమూర్-పొర్లగడ్డతండా రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు మంజూరు చేసి 5నెలలు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేదన్నారు. గురువారం మంచాలలో విలేకరులతో మాట్లాడుతూ గట్టుప్పల్, నారాయణపురం, మర్రిగూడ ప్రాంతాలకు చేరుకునేందుకు పొర్లగడ్డ రహదారి అనువుగా ఉంటుందని చెప్పారు.